సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం - 8లో▸

గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.



వారిది ధన బలం.. మాది ప్రజాబలం..

బీజేపీకి ధనబలం ఉంటే..కాంగ్రెస్‌కు ప్రజాబలం ఉందని వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41.8^0/26.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.


న్యూస్‌రీల్

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి



మంగపేట: మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలోని స్వయంభు స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పాటు ఆంజనేయస్వామి మాలదారులు సైతం భారీగా సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. ఆలయ సమీపంలోని చింతామణి జలపాతం, దైత అమ్మవారి(వనదేవత) ప్రాంతం భక్తజనంతో కిక్కిరిసింది. కార్లు, ఆటోలు, వివిధ ప్రైవేట్ బస్సులు తదితర వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్య స్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు స్వామివారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిలాతైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారులు గోత్ర నామాలతో స్వామివారికి ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. సంతానం కోసం వచ్చిన దంపతులకు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారాములు, సిబ్బంది శేషు, నూతలకంటి అజయ్, గొర్లపెల్లి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పదిమోటార్లు



ఏటూరునాగారం: బావిలో మోటార్లు ఒకటి లేదా రెండు వేసి నీటిని తోడుకుంటారు. కానీ ఏకంగా పది మోటార్లను ఒకేబావిలో వేసి నీటిని తోడడం విడ్డూరంగా ఉంది. మండల పరిధిలోని కొండాయి గ్రామంలో గ్రామ పంచాయతీ సమీపంలోని చేతబావిలో ఏకంగా పది విద్యుత్‌మోటార్లను స్థానికులు అమర్చుకొని నీటిని తోడుకుంటు ఇంటి అవసరాలను తీర్చుకుంటున్నారు. అదే విధంగా పలువు రు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకరి తర్వాత ఒకరు బకెట్లు, బిందెలు పట్టుకొని వచ్చి నీటిని ఇంటికి తీసుకెళ్తుంటారు. అయితే మిషన్ భగీరథ పైపులైన్ ఉన్నప్పటికీ అది ఎప్పుడు వస్తుందో తెలియకపోవడంతో ప్రజలు ఈ బావిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తాగునీటితో పాటు ఇంటి అవసరాలను తీర్చుకోవడానికి ఈ బావి నీరు ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చినా అధికారులు, పాలకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది ఏమిలేదు. భూగర్భజలాలు తగ్గిపోవడంతో నానా అవస్థలు పడుతూ ప్రజలు నీటిని తోడుకుంటున్నారు.


వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్

కాజీపేట రూరల్ : వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాజీపేట మీదుగా ప్రయాణించే పలు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. హైదరాబాద్-రక్సోల్ (07051) ఎక్స్‌ప్రెస్ ప్రతి శనివారం రాత్రి 10.48 గంటలు, సికింద్రాబాద్-ధానాపూర్ (07419) ఎక్స్‌ప్రెస్ ప్రతి శనివారం సాయంత్రం 5 గంటలు, హైదరాబాద్-పాట్నా (07255) ఎక్స్‌ప్రెస్ ప్రతి గురువారం 1.25 గంటలకు, సికింద్రాబాద్-పాట్నా (07256) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం రాత్రి 11 గంటలకు, సికింద్రాబాద్-సుబేదార్ ఘంజ్ (04122) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం ఉదయం 12 గంటలకు, హైదరాబాద్-గోరఖ్‌పూర్ (02575) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం 23.17 గంటలకు, సికింద్రాబాద్-రక్సోల్ (07007) ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం 17.10 గంటలకు, హైదరాబాద్-రక్సోల్ (07051) ఎక్స్‌ప్రెస్ ప్రతి శనివారం 22.48 గంటలకు, సికింద్రాబాద్-ముజఫర్‌పూర్ (05294) ప్రతి గురువారం 12 గంటలకు, సికింద్రాబాద్-రక్సోల్ (07005) ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమవారం 23.47 గంటలకు, మహబూబ్‌నగర్-గోరఖ్‌పూర్ (05304) ఎక్స్‌ప్రెస్ ప్రతి సోమవారం 22.58 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటాయని వివరించారు.

ఉండేనా.. ఊడేనా..!



జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం



భూపాలపల్లి జిల్లా రద్దు చేస్తారంటూ ప్రచారం

- 3 నెలలుగా సర్వత్రా చర్చ
- భూములు, ఇళ్ల కొనుగోలుకు వెనుకంజ
- స్తబ్ధుగా రియల్ ఎస్టేట్ రంగం

భూపాలపల్లి: పారిశ్రామికపరంగా దినదినం అభివృద్ధి చెందుతున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉంటదా.. పోతదా అనే చర్చ తీవ్రంగా సాగుతోంది. గడిచిన మూడు నెలలుగా సాగుతున్న ఈ ప్రచారం 'రియల్' రంగంపై ప్రభావం చూపుతోంది. భూముల ధరలు స్తబ్ధుగా ఉండగా, కొనుగోళ్లకు వెనుకంజ వేస్తున్నారు.

అద్భుతమైన జిల్లాగా రూపుదిద్దుకొని..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం జిల్లాల పునర్విభజనలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా 2016 అక్టోబర్ 11న ఏర్పడింది. 21 మండలాలతో ఏర్పడిన ఈ జిల్లాలో అత్యధిక అడవులు, పరిశ్రమలు, గోదావరి నీరు, ఇసుక, బొగ్గు తదితర ఖనిజ సంపదలు ఉన్నాయి. రామప్ప, లక్నవరం సరస్సులు, గణపసముద్రం, మేడారం, ఏటూరునాగారం ఐటీడీఏ, కేటీపీపీ, కాళేశ్వరం, సింగరేణి గనులతో జిల్లా కళకళలాడేది. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ఈ జిల్లాను విభజించి 10 మండలాలతో కూడిన ములుగు జిల్లాను 2019 ఫిబ్రవరి 17న ఏర్పాటు చేశారు. దీంతో భూపాలపల్లి జిల్లాలో 11 మండలాలు ఉండగా ఇటీవల రేగొండ మండలాన్ని విభజిస్తూ కొత్తగా కొత్తపల్లిగోరి మండలం ఏర్పాటు చేశారు. జిల్లా విభజన జరిగినప్పటికీ ఇక్కడి వనరుల ఆధారంగా అభివృద్ధిలో అత్యంత వేగంగా దూసుకెళ్తుంది. ఈ క్రమంలోనే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనపై ప్రకటనలు చేసింది. అప్పటి టీఆర్ఎస్ హయాంలో జిల్లాల పునర్విభజన సక్రమంగా జరగలేదని సీఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం పార్లమెంట్ నియోజకవర్గాలను జిల్లాలుగా ప్రకటిస్తారంటూ ప్రచారం జరుగుతోంది. దీంతో భూపాలపల్లి జిల్లా ఉంటదా.. పోతదా.. అంటూ జిల్లావ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

'రియల్' రంగంపై ప్రభావం..

జిల్లా ఏర్పడటానికి ముందు భూపాలపల్లి పట్టణంలో భూముల ధరలు అంతంత మాత్రంగానే ఉండేవి. జిల్లాకేంద్రంగా రూపుదిద్దుకున్నాక భూముల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. తొమ్మిదేళ్ల క్రితం వరకు రూ.3వేలకు గజం పలికిన భూమి, రోజురోజుకు పెరుగుతూ వస్తూ మూడు నెలల క్రితం రూ.10 వేలకు చేరుకుంది. జిల్లా పోతుందనే ప్రచారం జరుగుతుండటంతో ఆ ధర అక్కడితోనే నిలిచిపోయింది. ఏం జరుగుతుందోననే భయంతో ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూములు కొనే వారు కరువయ్యారు. రిజిస్ట్రేషన్ల శాఖలో గతంలో రోజుకు 50 రిజిస్ట్రేషన్లు కాగా ఇప్పుడు 15నుంచి 20వరకు మాత్రమే అవుతున్నాయి. అందులోనూ మార్టగేజ్, హౌస్ గిఫ్ట్ రిజిస్ట్రేషన్లే ఎక్కువగా ఉంటున్నాయి.

ప్రచారమే ఎక్కువ..

జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం, జిల్లా పోలీసు కార్యాలయం, మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు పూర్తయి వాడుకలో ఉన్నాయి. వివిధ కార్పొరేట్, వ్యాపార సంస్థలు ఇక్కడ తమ బ్రాంచీలను నెలకొల్పుకున్నాయి. విద్యా, వ్యాపార, వాణిజ్య రంగాల్లో ముందుకు వెళ్తుంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ జిల్లా అన్ని రంగాల్లో దినదినం అభివృద్ధి చెందుతోంది. దీంతో జిల్లాను రద్దు చేసే అవకాశాలు లేకపోయినప్పటికీ ప్రచారం మాత్రం జరుగుతోంది.

జిల్లా శాశ్వతంగా ఉంటుంది..



భూకంపం వచ్చినా భూపాలపల్లి జిల్లా ఎటూ పోదు. జిల్లా శాశ్వతంగా ఉంటుంది. ఇందులో ఎవరికీ ఎటువంటి అనుమానం అవసరం లేదు. ఒక అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఈ మాట ఇస్తున్నా. వ్యాపారస్తులు, పెట్టుబడిదారులు అనుమానం లేకుండా ఇక్కడ వ్యాపారాలు చేసుకోవచ్చు. నిస్వార్థంతో వారికి కావాల్సిన పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం. సింగరేణి, కేటీపీపీ పరిశ్రమలతో ఈ ప్రాంతం దినదినం అభివృద్ధి చెందుతోంది. నేను ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన. జిల్లా ఎటూ పోదు. ప్రజలకు ఎటువంటి అనుమానం అవసరం లేదు.

- గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే

మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

కలెక్టర్ భవేష్‌మిశ్రా



అక్షయతో తల్లితండ్రులు నరేష్, సుమలత

భూపాలపల్లి: చిన్నారి అక్షయకు శస్త్రచికిత్స చేయించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్‌మిశ్రా వెల్లడించారు. భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీనగర్‌కు చెందిన కాజీపేట నరేష్, సుమలత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత సంవత్సరం దీపావళి వేడుకల సమయంలో తన అన్నయ్య టపాకాయలు కాలుస్తుండగా ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న ఏడేళ్ల అక్షయ బట్టలకు నిప్పు అంటుకుని దుస్తులు కాలడంతో రెండు కాళ్లు, నడుం వరకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నరేష్ దంపతులు ఆమెకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యసేవలు అందించారు. అక్షయ పూర్తిగా కోలుకోలేదని, రెండు కాళ్లలో ఒక కాలికి ఆపరేషన్ చేయాల్సి వస్తుందని వైద్యులు తెలిపారు. ఇందుకు కనీసం రూ.2 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొన్నారు. డబ్బులు లేక ఆ దంపతులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదివారం స్పందించారు. తక్షణమే పాపకు వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఇక్కడ సాధ్యపడకపోతే మెరుగైన వైద్యసేవలకు హైదరాబాద్ పంపిస్తామని వెల్లడించారు. అందుకు అయ్యే ఖర్చులను చెల్లిస్తామని అక్షయ తల్లిదండ్రులతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి భరోసా ఇచ్చారు.

భూ ఆక్రమణపై పోలీసుల విచారణ



విచారణ చేపడుతున్న పోలీసులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని మంజూర్‌నగర్ బీసీ కాలనీ సమీపంలోని 186 సర్వేనంబర్‌లో ఆక్రమణకు గురైన భూమిని ఆదివారం భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మంజూర్‌నగర్, పుల్లూరిరామయ్యపల్లి గ్రామాలకు చెందిన వెంకట్‌రెడ్డి, పి.రాంరెడ్డి, వెంకన్న అనే పలువురు బాధితులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు భూకబ్జాకు పాల్పడి వెంచర్ ఏర్పాటు చేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు భూమి వద్దకు వెళ్లి బాధితులు, చుట్టు పక్క రైతులతో మాట్లాడి విచారణ చేపట్టారు. కొత్త హరిబాబుపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ కొనసాగుతుందని, విచారణ అనంతరం కేసు నమోదు చేయనున్నట్లు సీఐ నరేష్ తెలిపారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

ములుగు రూరల్: ములుగు జిల్లా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం జాకారం శివారులో నూతనంగా నిర్మించిన భవనాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేములపల్లి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ ఓనర్స్ ఐకమత్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కోనేరు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు షేక్ ఖాజా పాషా, రంగరామకృష్ణ, షేక్ గౌస్, మంచోజు బ్రహ్మచారి, కుతుబుద్దీన్, దామోదర్‌రెడ్డి, కర్ణాకర్, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

అపరిచితులకు సహకరించొద్దు

కాటారం సీఐ నాగేశ్వర్‌రావు



గొత్తికోయలతో మాట్లాడుతున్న సీఐ

మహాముత్తారం : గొత్తికోయగూడెంలోకి అపరిచిత వ్యక్తులు వస్తే వారికి సహకరించొద్దని కాటారం సీఐ నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని దండేపల్లిగూడెంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గొత్తికోయగూడెంలో ఎంత మంది నివసిస్తున్నారు..వారి ఆధార్‌కార్డుల ఆధారంగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. అజ్ఞాత వ్యక్తులకు సహకరించొద్దని గూడెంలో ఏ సమస్య ఉన్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవాలే తప్ప అడ్డదారులు తొక్కొద్దని సూచించారు. ఎవరైనా స్వప్రయోజనాల కోసం అజ్ఞాత వ్యక్తులకు సహకరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడీడు పిల్లలను బడికి పంపించాలని విద్యార్థుల కోసం కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. సీఐ వెంట మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్, సీఆర్పీఎఫ్ డీఎస్పీ, సివిల్ పోలీసులు ఉన్నారు.

అభద్రతా భావానికి లోనుకావొద్దు

టోల్‌ఫ్రీ 14416 నంబర్‌లో సంప్రదించండి

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయితే అభద్రతా భావానికి లోనుకావొద్దని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరో రెండు మూడు రోజుల్లో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దని చెప్పారు. ఒక వేళ ఫెయిల్ అయితే పట్టుదలతో చదివి సప్లిమెంటరీలో పాస్‌కావాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. మానసిక సమస్యలు ఉంటే టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్ (14416)కు కాల్ చేయాలని సూచించారు. వైద్యులు ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తారని తెలిపారు. ప్రత్యేకంగా కౌన్సెలింగ్ అవసరమని గుర్తిస్తే కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మానసిక ఆరోగ్య విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

కాళేశ్వరం శివారు అడవిలో ఎగిసిపడుతున్న మంటలు



అడవిలో కార్చిచ్చు..



కాళేశ్వరం శివారు అడవిలో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం శివారు అటవీప్రాంతంలో కార్చిచ్చు అంటుకుంది. ఆదివారం రాత్రి అడవిలో మంటలు ఎగిసిపడ్డాయి. కాళేశ్వరం వచ్చే యాత్రికులు అడవిలో వంటలు చేసుకొని వదిలేయడంతో మంటలు గాలికి అంటుకున్నట్లు తెలిసింది. మంటలు వ్యాపించడంతో అడవి జీవరాశులు పరుగులు తీశాయి. అటవీ సంపద కార్చిచ్చుతో బూడిద అవుతున్నా అటవీశాఖ అధికారులు స్పందించలేదు. వేసవికాలం కావడంతో ఆకులన్నీ ఎండపోయి ఉండడంతో నిప్పుఅంటుకోవడంతో కిలోమీటరు మేరకు వ్యాపిస్తున్నా సంబంధిత అధికారులు రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. అడవిలో చిన్న చిన్న మొక్కలు, చెట్లు కాలి ఆహుతి అవుతున్నాయి. మొబైల్ ఫైర్ టీంలు సంచరించకపోవడంతో విలువైన అటవీ సంపద కాలి బూడిదవుతుందని ఆరోపణలు ఉన్నాయి.

వామ్మో ఇవేం రోడ్లు

ఇబ్బంది పడుతున్న వాహనదారులు





నాచారం గ్రామ సమీపంలో..



కొట్టుకుపోయిన వేశాలపల్లి కొంపెల్లి రోడ్డు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలో పలుచోట్ల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వాహనదారులు రోడ్లపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. కొన్నిచోట్ల గుంతలుగా మారగా, మరికొన్ని చోట్ల ఇరుకుగా ఉండి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

ఎక్కడెక్కడంటే..

భూపాలపల్లి మండలంలోని కాసింపల్లి, జంగేడు నుంచి అన్‌సాన్‌పల్లి, గొర్లవీడు, నేరేడుపల్లి గ్రామాలకు అనుసంధానం చేసిన బీటీ రోడ్డు గతేడాది జూన్‌లో కురిసిన అధిక వర్షాలకు తెగిపోయింది. అధికారులు మాత్రం తూతూ..మంత్రంగా మొరం పోయించి చేతులు దులుపుకున్నారు. రోడ్డు పక్కన మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డు సగం తెగి ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డుపై నుంచి నిత్యం ప్రయాణం చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదనే వాదనలు ఉన్నాయి.

వర్షాలకు కోతకు గురైన బీటీ రోడ్డు

భూపాలపల్లి మండలంలోని కాసింపల్లి, వేశాలపల్లి, జంగేడు మీదుగా మల్హర్ మండలంలోని అన్‌సాన్‌పల్లి, నాచారం, భూపాలపల్లి మండంలోని గొర్లవీడు, వజినపల్లి, నేరేడుపల్లి, గ్రామాల ప్రజలు జిల్లాకేంద్రానికి రాకపోకలకు అనుకూలంగా బీటీ రోడ్డు వేశారు. గతేడాది జూన్‌లో అధికంగా కురిసిన వర్షాలకు నాచారం గ్రామానికి సమీపంలో రోడ్డు రెండుచోట్ల తెగిపోయింది. రోడ్డుకు ఇరువైపులా మట్టి కొట్టుకుపోయింది. అధికారులు మాత్రం రోడ్డు తెగిపోయిన ప్రదేశంలో మాత్రం మట్టిపోసి రాకపోకలకు ఏర్పాటు చేశారు. కానీ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వర్షాకాలానికి ముందే రోడ్డుకు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. వేశాలపల్లి నుంచి కొంపెల్లికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. ఇప్పటికీ మరమ్మతులు చేయించలేదు. వర్షాలు మొదలైతే వేశాలపల్లి, కొంపెల్లికి రాకపోకలు బంద్ కానున్నాయి.

ఏజెన్సీకి ముంపు ముప్పు!

వర్షాకాలానికి ముందే గోదావరి కరకట్ట మరమ్మతులు చేస్తేనే మేలు

- గ్రేహౌన్స్, అడ్డుకట్టలు, రాయితో రివిట్‌మెంట్ తప్పనిసరి



ఒర్రిపోతున్న గోదావరి కరకట్ట

ఏటూరునాగారం : వర్షాకాలంలో ఏజెన్సీ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ప్రతిఏటా గోదావరి వరద పెరుగుతూ వస్తుంది. దీంతో ఏటూరునాగారం, రామన్నగూడెం, కోయగూడ, ఎల్లాపురం గ్రామ పంచాయతీల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. 1986లో గోదావరి వరద ముంపునకు 50 గ్రామాలు నేలమట్టమయ్యాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. భారీగా ఆస్తినష్టం జరిగింది. ఈ క్రమంలో 1995లో ఎక్కెల గ్రామం నుంచి ఏటూరునాగారం మీదుగా రామన్నగూడెం పుష్కర ఘాట్ వరకు రూ. 40 లక్షలతో 10.2 కిలోమీటర్ల కరకట్ట నిర్మించి రివిట్‌మెంట్ చేశారు. 2019లో వచ్చిన గోదావరి వరదతో రివిట్‌మెంట్ కొట్టుకుపోయి కరకట్ట కోతకు గురైంది. ఇలా ప్రతీ ఏడాది వరదలు వస్తున్నప్పుడు కరకట్ట కోతకు గురవుతూనే ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఏక్షణంలో ఏమవుతుందోననే భయాందోళనతో బతుకుతున్నారు. రాబోయే వర్షాకాలం లోపు కరకట్ట మరమ్మతులు చేపట్టకపోతే ఆయా గ్రామాల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముందస్తుగా మేల్కొని మరమ్మతు పనులు చేపట్టకపోతే ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు. 2021లో కరకట్ట నిర్మాణ పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేయగా 2022లో రూ.137 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ బడ్జెట్‌ను మరమ్మతులకు ఖర్చు చేయలేదు. అత్యవసరంగా మంజూరు చేసిన రూ.6 కోట్లతో పనులు చేపట్టారు. ఆ మరమ్మతులు కూడా వరదలకు కొట్టుకుపోయాయి.

నిర్మాణ పనులు చేపట్టి 29ఏళ్లు..

గోదావరి కరకట్ట నిర్మాణం పనులు చేపట్టి 29ఏళ్లు గడిచింది. కరకట్ట 10.2 కిలోమీటర్ల మేర ఉన్నప్పటికీ 3.5 కిలోమీటర్ల వద్ద ఏటూరునాగారం ఓడగూడెం ప్రాంతంలో ఒడ్డు కొట్టుకుపోయి బలహీనపడింది. అలాగే 5.8 కిలోమీటర్ల వద్ద రాతికట్టడాలు సైతం గోదావరిలో కలిసిపోయి కరకట్ట సగం మేర కోతకు గురైంది. 10 ఫీట్ల మేర మాత్రమే మట్టి ఉంది. దీనిని తాత్కాలికంగా మరమ్మతు చేసినా వరద తాకిడికి కరకట్ట ఒర్రిపోతూ వస్తోంది. 6.9 కిలోమీటర్ల వద్ద ఒడ్డు కూలిపోయి ఉంది.

అమలుకు నోచుకోని హామీలు

2022లో గోదావరి ఉప్పొంగడంతో ముంపు ప్రాంతాల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. అప్పటి సీఎం కేసీఆర్ సైతం ఏటూరునాగారం, రామన్నగూడెం సందర్శించి కరకట్ట నిర్మాణ పనుల్లో వేగం పెంచుతామని వాగ్దానం చేశారు. కానీ, ఆ హామీ అమలుకు నోచుకోలేదు. అయితే వరంగల్‌కు చెందిన కావేరి కంపెనీ కరకట్ట నిర్మాణ పనుల టెండర్లను దక్కించుకుంటే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ఓ మాజీ మంత్రి బంధువుకు చెందిన వ్యక్తి బలవంతంగా ఈ కాంట్రాక్ట్‌ను ఆ కంపెనీ నుంచి తీసుకున్నట్లు విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ కాంట్రాక్టర్ కరకట్ట పనులపై ఆసక్తి చూపడం లేదు.

ఇలా చేస్తేనే మేలు..

గ్రేహౌన్స్ నిర్మాణం(రాతి కట్టడం) కరకట్ట నుంచి వంద మీటర్ల లోపలికి వంద మీటర్ల వెడల్పుతో (జడ అల్లకం) 60 డిగ్రీల కోణంలో కట్టి వరద నీటి ప్రవాహం అటువైపుగా మళ్లిస్తే కరకట్ట మీద ఒత్తిడి తగ్గుతుంది. ఇలా ఐదు చోట్ల గ్రేహౌన్స్ కడితేనే కరకట్ట ఆగుతుందని ఇంజనీరింగ్ నిపుణులు తేల్చారు. దీంతోపాటు కరకట్ట ఒర్రిపోకుండా లాంచింగ్ ఆప్రాన్ (రాయితో రాతికట్టడాలు) కట్టాల్సి ఉంది. ఈ వర్షాకాలంలోపు లాంచింగ్ ఆప్రాన్, గ్రేహౌన్స్ నిర్మాణాలు చేస్తేనే కరకట్ట ఆగుతుందని లేదంటే మొత్తం కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తెలంగాణ ఇరిగేషన్ రీసెర్చ్ ల్యాబొరేటరీ అధికారులు పలుమార్లు సర్వే చేసి పై నిర్మాణాల చేపట్టాల్సిందేనని తేల్చిచెప్పారు. కానీ, దానికి ఎలాంటి అంకురార్పణ జరగడం లేదు.

వారిది ధన బలం.. మాది ప్రజాబలం

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



హసన్‌పర్తి : మాట్లాడుతున్న కడియం కావ్య

హసన్‌పర్తి: బీజేపీకి ధనబలం ఉంటే..కాంగ్రెస్‌కు ప్రజాబలం ఉందని వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. ఆదివారం కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి సమావేశం హంటర్ రోడ్డులో జరిగింది. కావ్య మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ పదేళ్లల్లో ఎన్ని అరాచకాలు చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. నియోజకవర్గ ఆడబిడ్డగా తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాష్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పర్వతగిరి జెడ్పీటీసీ బానోత్ సింగులాల్, మాజీ కార్పొరేటర్ కల్పన పాల్గొన్నారు.

జేఎన్‌ఎస్‌లో కావ్య ప్రచారం

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కావ్య ఆదివారం ఉదయం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజుతో కలిసి కావ్య గ్రౌండ్‌లో సాధన చేస్తున్న వివిధ క్రీడాకారులు, వాకర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. వరంగల్ అభివృద్ధి చెందాలంటే రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

● బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్

హన్మకొండ: గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ తయారు చేసిన ఉత్పత్తుల(నేతలు) ను కాంగ్రెస్, బీజేపీ కొనుగోలు చేసిందన్నారు. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో బీఆర్‌ఎస్ ముందంజలో ఉందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి విభజన చట్టంలోని హామీల అమలు చేయడంలో బీజేపీ విఫలమైందని విమర్శించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్ ఈ నెల 22న నామినేషన్ వేస్తారన్నారు. 23న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ పర్యటనకు వస్తున్నారన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించిన సమయంలో మూడో స్థానంలో ఉంటామని కడియం శ్రీహరి అన్నారని, ఇప్పుడు వారు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ మూడో స్థానంలోకి వెళ్లిందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కబ్జాదారు అని ఆరోపించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ధర్మం గెలుస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, 'కుడా' మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, టీజీపీ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి, నాయకులు ఎల్లావుల లలితాయాదవ్, బొల్లికొండ వీరేందర్, జోరిక రమేష్, చింతల యాదగిరి, ఇండ్ల నాగేశ్వర్ రావు, పులి రజనీకాంత్ పాల్గొన్నారు.

రేపు వరంగల్‌కు కేటీఆర్..




సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి: వరంగల్ లోక్ సభ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్ నేడు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మాజీ మంత్రి దయాకర్‌రావు తెలిపారు. ఆదివారం నగరంలోని 'డి' గార్డెన్‌లో నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. మంగళవారం (రేపు) ఇదే గార్డెన్‌లో నిర్వహించనున్న వర్ధన్నపేట నియోజకవర్గ సన్నాహక సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారన్నారు. కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, 'కుడా' మాజీ చైర్మన్లు సుందర్‌రాజ్, యాదవరెడ్డి, రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, రాధికారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మారిన రూపురేఖలు

2009లో నియోజకవర్గాల పునర్విభజన

- రెండు స్థానాలు పూర్వ వరంగల్ జిల్లాల్లోనే..
- జిల్లాల పునర్విభజన తర్వాత ఏడు జిల్లాల్లో ఓటర్లు
- కలగాపులగంగా మండలాలు, గ్రామాలు..
- పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి అభ్యర్థుల పాట్లు..





సాక్షిప్రతినిధి, వరంగల్ :

ప్రతిష్టాత్మకంగా మారిన పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నాయి. ఈ ఎన్నికలు ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు సవాల్‌గా మారగా.. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల భౌగోళిక పరిస్థితులపై ఆ మూడు పార్టీల వ్యూహకర్తలు దృష్టి సారించారు. ఈ నెల 25వ తేదీతో నామినేషన్ల ఘట్టం ముగియనుండగా.. మరుసటి రోజు నుంచి ప్రచారం హోరెత్తించేందుకు అన్ని పార్టీలు అగ్రనేతలను రంగంలోకి దింపే పనిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు ఏయే జిల్లాలు, మండలాలకు విస్తరించి ఉన్నాయి..? తక్కువలో తక్కువగా ఎన్ని సభలు నిర్వహించొచ్చు..? అగ్రనేతల బహిరంగసభలకు ఏ సెంటరైతే అనువుగా ఉంటుంది..? జన సమీకరణకు ఎక్కడైతే సులువుగా ఉంటుంది? అనే కోణాల్లో లెక్కలు వేస్తున్నారు. ఏడు జిల్లాలు, 74 మండలాలకు విస్తరించి ఉన్న ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులోని ఓటర్లు కూడా తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని హనుమకొండ, వరంగల్, జనగామ, జేఎస్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు.. 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, 74 మండలాలపై పట్టు సాధించేందుకు అన్ని పార్టీల వ్యూహకర్తలు ముఖ్యనేతలతో చర్చలు జరుపుతున్నారు.

వరంగల్ పార్లమెంట్..

అసెంబ్లీ నియోజకవర్గం	మండలాల సంఖ్య
స్టేషన్‌ఘన్‌పూర్(ఎస్సీ)	07
పాలకుర్తి	06
పరకాల	06
వరంగల్ పశ్చిమ	02+33 డివిజన్లు
వరంగల్ తూర్పు	02+33 డి
వర్ధన్నపేట(ఎస్సీ)	04
జేఎస్ భూపాలపల్లి	07
మొత్తం	34

మహబూబాబాద్ పార్లమెంట్..

అసెంబ్లీ నియోజకవర్గం	మండలాల సంఖ్య
డోర్నకల్(ఎస్టీ)	06
మహబూబాబాద్(ఎస్టీ)	04
నర్సంపేట	06
ములుగు(ఎస్టీ)	09
పినపాక(ఎస్టీ)	05
ఇల్లందు(ఎస్టీ)	05
భద్రాచలం(ఎస్టీ)	05
మొత్తం	40

అసెంబ్లీ సెగ్మెంట్లు, మండలాలు, ఓట్ల వారీగా..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 16న ప్రకటించిన ప్రకారం.. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 18,16,543 మంది ఓటర్లు ఉన్నారు. 8,91,940 మంది పురుషులు, 9,24,208 మంది మహిళలు, 395 మంది ఇతరులు ఉన్నారు. ఈ లోక్‌సభ స్థానంలో పురుషుల కంటే 32,268 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్(ఎస్సీ), పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట(ఎస్సీ), భూపాలపల్లి నియోజకవర్గాల్లో 34 మండలాలు ఉన్నాయి. అలాగే, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 15,28,255 మంది ఓటర్లు ఉన్నారు. 7,46,019 మంది పురుషులు, 7,82,131 మంది మహిళలు, 105 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఇందులో కూడా పురుషుల కంటే 36,112 మంది మహిళలు అధికంగా ఉన్నారు. నర్సంపేట మినహా డోర్నకల్, మహబూబాబాద్, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్లు ఎస్టీలకు రిజర్వ్ చేయగా, 40 మండలాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ (కరీంనగర్ పార్లమెంట్) నియోజకవర్గంలో ఉండగా.. ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నాయి. జేఎస్ భూపాలపల్లి జిల్లాకు చెందిన కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాలు పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లి లోక్‌సభ స్థానం కిందకు వస్తాయి. ఇలా మిగితా జిల్లాలు, మండలాల ఓట్లు రాబట్టడంపై రాజకీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి.

14 సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే..

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో 14 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. 2023లో జరిగిన ఎన్నికల్లో 12 చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందగా.. బీఆర్‌ఎస్ నుంచి విజయం సాధించిన ఇద్దరు కూడా కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో రెండు లోక్‌సభ స్థానాల పరిధిలోని 14 సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్‌ల పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, భద్రాచలం నుంచి ఒక్కో స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా పోటీ చేసిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. మిగతా వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పాలకుర్తి, పరకాల, వర్ధన్నపేట(ఎస్సీ), భూపాలపల్లి నుంచి కొండా సురేఖ, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణ.. నర్సంపేట, డోర్నకల్, మహబూబాబాద్, ములుగు, పినపాక, ఇల్లందు నుంచి దొంతి మాధవరెడ్డి, జాటోతు రాంచంద్రనాయక్, భూక్యా మురళీనాయక్, ధనసరి సీతక్క, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనుకయ్య గెలుపొందారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మారిన రాజకీయ సమీకరణలో భాగంగా బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అన్ని స్థానాలు ఆ పార్టీ ఖాతాలోనే ఉన్నాయి.

మారిన హనుమకొండ, భద్రాచలం..

అప్పటి వరకు ఉన్న హనుమకొండ, భద్రాచలం పార్లమెంట్ నియోజకవర్గాల రూపురేఖలు.. 2009 పునర్విభజనలో మారాయి. అప్పటి వరకు హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఒక సారి, కాంగ్రెస్(ఐ) నాలుగుసార్లు, టీడీపీ రెండు సార్లు, బీజేపీ ఒకసారి, టీఆర్‌ఎస్ రెండుసార్లు గెలిచాయి. దేశానికి ప్రధానిగా సేవలు అందించిన పి.వి నరసింహారావు ప్రాతినిథ్యం వహించిన ఆ నియోజకవర్గం 2009 నుంచి రద్దయింది. పీవీ నరసింహారావు రెండుసార్లు ఇక్కడి నుంచి గెలుపొందారు. కాగా, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తొలినాళ్లలో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం కూడా ద్విసభ్య నియోజకవర్గంగా కొనసాగింది. ఈ సమయంలో 1957, 1962లలో సార్వత్రిక ఎన్నికలు, 1965లో ఉప ఎన్నికలు జరిగాయి. ఈ మూడు ఎన్నిల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే విజయం వరించింది. 1965లో రద్దయిన మహబూబాబాద్ 2009 పునర్విభజనలో మళ్లీ ఏర్పడింది. తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇదిలా ఉండగా 1967లో ఆవిర్భవించిన భద్రాచలం పార్లమెంట్ నియోజకవర్గం 2009లో రద్దయింది. ఖమ్మం జిల్లాతో పాటు ఏపీలోని పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లతో కలిపి తెలంగాణ, ఆంధ్ర పాంతాలకు వారధిగా ఉండే భద్రాచలం నియోజకవర్గం 2009 నుంచి రద్దు అయింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ మూడుసార్లు గెలుపొందగా, సీపీఐ మూడుసార్లు, సీపీఎం ఒకసారి గెలుపొందింది.



పరకాల: పోలీసులకు నగదుతో పట్టుబడిన వ్యక్తులు

రూ.5.26 లక్షల నగదు పట్టివేత

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో రూ.5.26 లక్షల నగదు పట్టుబడింది. పరకాలలో రూ.2.8 లక్షలు, పెంబర్తి వద్ద 1.8 లక్షలు, నర్మెటలో 1.38 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పరకాల: భూపాలపల్లి రోడ్డులోని ఎం.ఆర్ రెడ్డి కళాశాల ఎదుట ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఇందులో ఘన్‌పూర్ మండలం గాంధీనగర్‌కు చెందిన రావుల అవినాష్ వద్ద రూ.లక్షా 50 వేలు, పెంట చిరంజీవి వద్ద రూ. 58వేల 700 లభించాయి. ఈ నగదుకు ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిరాజ్ తెలిపారు.

పెంబర్తి చెక్‌పోస్టు వద్ద 1.80 లక్షలు..

జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు రూ. 1.80 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పెంబర్తి నుంచి బైక్‌పై జనగామకు వస్తున్న ఎం వంశీ నుంచి ఎలాంటి ఆధారాలు లేని కారణంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సృజన్, తిరుపతి తెలిపారు.

నర్మెటలో రూ.1.38 లక్షలు..

నర్మెట: నగదు తీసుకెళ్లే సమయంలో సరైన పత్రాలు కలిగి ఉండాలని సీఐ మినుకూరి వెంకటరమణ తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు మండల కేంద్రంలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో కారులో ప్రయాణిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలానికి చెందిన ఎర్రోల్ల యాదయ్య నుంచి రూ.1.38 లక్షల నగదు సీజ్ చేశామన్నారు. సరైన ఆధారాలు చూపని కారణంగా ఎలక్షన్ గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్, సిబ్బంది ధనుంజయ్, కెంగెర్ల రమేశ్, కాసరాజు రాజు పాల్గొన్నారు.



జనగామ రూరల్: పెంబర్తిలో నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

వ్యక్తి అదృశ్యం



రమేష్

వరంగల్: ఏనుమాముల శివారు ముసలమ్మకుంటకు చెందిన మాడిశెట్టి రమేశ్ (49) అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ తెలిపారు. రమేశ్ గత కొద్దికాలంగా పాత లారీలను కొనుగోలు చేసి విక్రయాలు జరిపేవాడని, ఈ వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పుల పాలైనట్లు తెలిపారు. ఈక్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని, ఈనెల 19న సాయంత్రం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. అతడి కోసం రెండు రోజులపాటు వెతకగా ఎలాంటి ఆచూకీ తెలియలేదు. రమేశ్ భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై శ్రీకాంత్ దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీ..

● ఇద్దరి మృతి ● డోర్నకల్ సమీపంలో ఘటన



జశ్వంత్ (ఫైల్)

డోర్నకల్: డోర్నకల్ పట్టణ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. డోర్నకల్ మండలం రామకుంటతండాకు చెందిన తేజావత్ జశ్వంత్(23), తేజావత్ మంగీలాల్ డోర్నకల్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తూ సమ్మర్ స్టోరేజీ సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. దీంతో జశ్వంత్, మంగీలాల్‌తో పాటు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనంపై ఉన్న ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడుతండాకు చెందిన బానోత్ మోహన్(45)కు తీవ్ర గాయాలు కాగా ఆయన భార్య పార్వతి, కుమార్తె అనూషకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై తిరుపతితో పాటు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని 108కు సమాచారం అందించారు. కానిస్టేబుల్ సర్వర్‌పాషా అపస్మారకస్థితిలో ఉన్న క్షతగాత్రులకు సీపీఆర్ చేసిన అనంతరం 108లో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జశ్వంత్, మోహన్ మృతి చెందారు. ఈ ఘటనపై మృతుడు మోహన్ భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు.

చైల్డ్‌లైన్‌కు చిన్నారుల అప్పగింత



చైల్డ్‌లైన్ సిబ్బందికి ఇద్దరు చిన్నారులను అప్పగిస్తున్న వరంగల్ ఆర్పీఎఫ్ సిబ్బంది

కాశిబుగ్గ: వరంగల్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పందగా తిరుగుతున్న ఇద్దరు చిన్నారులను ఆర్పీఎఫ్ సిబ్బంది రక్షించి చైల్డ్‌లైన్ వారికి అప్పగించారు. ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్‌కె సుభానీ కథనం ప్రకారం.. స్టేషన్‌లోని మొదటి ప్లాట్‌ఫాం సమీపంలోని టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ఇద్దరు చిన్నారులు తిరుగుతున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ నీలం మింజ్ వారిని గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిది కర్ణాటక రాష్ట్రం గల్బార్గా అని, రెండు రోజుల క్రితం తల్లితో కలిసి వరంగల్‌కు వచ్చామని తెలిపారన్నారు. శనివారం ఉదయం 8 గంటల సమయంలో తల్లి వరంగల్ రైల్వే స్టేషన్‌లో తమని వదిలివెళ్లిపోయిందని తెలిపారన్నారు. వారిని రక్షించి చైల్డ్‌లైన్ వారికి సమాచారం ఇచ్చి అప్పగించామని ఎస్సై తెలిపారు.

రియల్టర్లు చంపుతామని బెదిరిస్తున్నారు..

- ● పెట్టుబడి ఇవ్వకుండా తిప్పుతున్నారు
- ● విలేకరులతో గోడు వెల్లబోసుకున్న బాధితుడు



భూమి కొనుగోలు పత్రాలు చూపుతున్న సూర్యనారాయణ

గీసుకొండ: భూమి కొనుగోలు కోసం పెట్టిన పెట్టుబడి డబ్బు ఇవ్వకపోవడమే కాకుండా పెద్దమనుషుల తీర్మానాలను సైతం కాదని రియల్టర్లు తనను చంపుతామని బెదిరిస్తున్నారని గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన నాసం సూర్యనారాయణ వాపోయారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కొనాయమాకులలో విలేకరులతో తన గోడు వెల్లబోసుకున్నాడు. కొనాయమాకులకు చెందిన మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు డోలె చిన్ని, పోతరాజుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు కోట రేణుక ప్లాట్ల బిజినెస్ కోసం భూమి కొనుగోలు చేద్దామని తన వద్ద రూ. 26 లక్షలు పెట్టుబడిగా, తన ద్వారా తన స్నేహితుడి నుంచి రూ. 10 లక్షలు అప్పుగా తీసుకుని ఇవ్వకుండా మూడేళ్లుగా తిప్పుతున్నారన్నారు. తాను ఇచ్చిన డబ్బుతో ఊకల్ గ్రామ పరిధిలోని 11వ సర్వే నంబర్‌లో ఎకరం భూమి, దాని పక్కనే 2 వేల గజాల స్థలం కొనుగోలు చేశారన్నారు. ముందు వాటి కొనుగోలు అగ్రిమెంట్ తన పేరుపై చేసి ఆ తర్వాత తనకు తెలియకుండా ఎకరం భూమిని వారి పేర పట్టాచేయించుకుని ప్లాట్లుగా చేసి చాలా వరకు అమ్ముకున్నారన్నారు. ఇదేమిటని అడిగితే ఏం చేసుకుంటావో చేసుకొమ్మని మొండికేశారన్నారు. ఈ నెల 16న తాను పెట్టిన పెట్టుబడితో పాటు తన స్నేహితుడి నుంచి తీసుకున్న అప్పు, గుడ్‌విల్ కింద మొత్తం కలిపి రూ. 45 లక్షల విలువైన 840 గజాల స్థలం ఇస్తామంటూ వారికి అనుకూలంగా పెద్దమనుషులతో తీర్మానం చేయించారని, దానికి తాను ఒప్పుకోకుండా భూమి కాకుండా నగదు ఇవ్వాలని కోరితే ఏం చేసుకుంటావో చేసుకో, చంపుతామని బెదిరించారన్నారు. ఈ విషయంలో సీపీకి తన గోడు విన్నవించి న్యాయం చేయాలని కోరుతానని తెలిపారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు రూ. 30 వేల విలువైన రెండు కిలోల గంజాయితో పాటు రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పద్మాక్షి కాలనీ, శ్మశానవాటిక పరిసర ప్రాంతంలో కొంత మంది యువకులు గంజాయి సేవిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో వెళ్లి యువకులను అదుపులోని తీసుకున్నారు. అనంతరం పరిసరాలు తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి లభించింది. దీంతో ఆత్మకూరు మండలం పెంచికలపేటకు చెందిన జంగం వంశీ, జనగామ జిల్లా చిల్పూరు మండలం వంగాలపల్లి గ్రామానికి చెందిన ఆరూరి వంశీ, హనుమకొండ పద్మాక్షి కాలనీకి చెందిన ఐత శివ, గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన బుగ్గ నవీన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ తెలిపారు. కాగా, సీఐ సతీష్, ఎస్సైలు శ్రీనివాస్, పరుశురాములు, హెడ్ కానిస్టేబుళ్లు రవీందర్ రెడ్డి, అశోక్, కానిస్టేబుల్ కిరణ్‌ను ఏసీపీ అభినందించారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం


- ● బీఎల్‌వీ సెట్‌కు 91శాతం హాజరు
- ● 6, 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశాలకు అవకాశం

విద్యారణ్యపురి: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8వ తరగతుల్లో, సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ గురుకుల పాఠశాలలో 9వ తరగతిలో బ్యాక్‌లాగ్ సీట్లలో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం వరంగల్ రీజియన్‌లో ప్రవేశపరీక్షను(బీఎల్‌వీ సెట్) ప్రశాంతంగా ముగిసింది. వరంగల్ రీజియన్‌లో హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పరకాల, ఎల్కతుర్తి, నర్సంపేట, పర్వతగిరి, రాయపర్తి, చిట్యాల, జాకారం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో 2,740మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 2,487మంది (91శాతం) హాజరయ్యారు. 283మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకులాల వరంగల్ రీజినల్ ఆర్‌సీఓ విద్యారాణి పరకాల, ఎల్కతుర్తి గురుకుల పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణతీరును పరిశీలించారు.

టీఎస్‌ఆర్‌జేసీ సెట్‌కు 83.52శాతం హాజరు

తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష(టీఎస్‌ఆర్‌జేసీ) ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యార్థులకు హనుమకొండ జిల్లాలోనే 33 పరీక్ష కేంద్రాల్లో టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశపరీక్షను నిర్వహించారు. ఈపరీక్షకు 7,830మంది విద్యార్థులకు 6,540మంది(83.52శాతం)హాజరుకాగా 1,290 మంది గైర్హాజరయ్యారని టీఎస్‌ఆర్‌జేసీ జిల్లా కోఆర్డినేటర్ ఇందుమతి తెలిపారు. హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, టీఎస్‌ఆర్‌జేసీ జిల్లా కోఆర్డినేటర్, హసన్‌పర్తి టీఎస్‌ఆర్జేసీ ప్రిన్సిపాల్ ఇందుమతి వేర్వేరుగా పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

బావిలో పడి రైతు మృతి



రమేశ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : బావిలో పడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం ఉత్తరతండా గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోడ రమేశ్(30) తన కున్న మూడెకరాల భూమిలో వరి సాగు చేస్తున్నాడు. వేసవి నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బావిలో నీరు తగ్గింది. ఫలితంగా పంటకు నీరు పారకం సరిపోవడం లేదు. దీంతో రెండు, మూడు రోజులకు ఒకసారి వ్యవసాయ బావి ద్వారా వరిపంటకు నీరు పెడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బావి వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేయగా నీరు సరిగా రాలేదు. గమనించిన రమేశ్ మోటారుకు ఉన్న పైపును కదిలించే క్రమంలో బావిలో పడ్డాడు. కొంత దూరంలో ఉన్న తండ్రి కిషన్ గమనించి వచ్చి బావిలోకిదూకి రమేశ్‌ను పక్కకు తీసుకువచ్చి రక్షించే ప్రయత్నం చేశాడు. అప్పటికే రమేశ్ మృతిచెందాడు. స్థానికులు వచ్చి మృతదేహాన్ని బయటకుతీసి పోలీసులకు సమాచారం ఇవ్వగా రూరల్ ఎస్సై దీపికారెడ్డి ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.